నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT
హైదరాబాద్
ఆదివారం 29 అక్టోబర్ 2023
SUNDAY, OCTOBER 29, 2023
HYDERABAD
పేజీలు PAGES : 16



కేపీహెచ్‌బీ కాలనీలో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

# హస్తం ఆగమాగం

## అగ్గిరాజేసిన.. టికెట్ ఫర్ సేల్

**జెండాలు మోసిన చేతులతోనే గాంధీభవన్‌పై రాళ్ల దాడి**

రేవంత్ రెడ్డి ఫ్లెక్సీలు చింపి.. పార్టీ జెండాలు దహనం

రణరంగం సృష్టించిన విష్ణు వర్గీయులు

**టికెట్లు అమ్ముకున్నావంటూ..**
**టీపీసీసీ అధ్యక్షుడిపై ధ్వజమెత్తిన అసంతృప్తులు**

కూకట్‌పల్లిలో పార్టీకి గొట్టిముక్కల రాజీనామా

ప్రచార రథాలు సిద్ధం చేయించి.. కోట్లు ఖర్చు పెట్టించి..
మోసం చేశారంటూ చిగిరింత దంపతులు ఆగ్రహం

**ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం,**
**అంబర్‌పేటలోనూ ఇదే పరిస్థితి**

అధిష్టానానికి అల్టిమేటం జారీ చేసిన
ఆయా నియోజకవర్గాల ఆశావహులు

**నేడు కార్యకర్తలతో సమావేశమై**
**భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం**

ఎల్బీనగర్‌లో మధుయాష్కీ నేతల జలక్..,
మహేశ్వరంలో కేఎల్ఆర్‌కు సహాయ నిరాకరణ

కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా ప్రకటనతో అగ్గి రాజుకున్నది. శనివారం ఉదయం ఆరోపణలతో మొదలైన ఈ వేడి.. సాయంత్రానికి గాంధీభవన్‌ను తాకింది. ఇన్నాళ్లు జెండాలు మోసిన చేతులతోనే గాంధీభవన్‌పై రాళ్లు విసిరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కోట్లాది రూపాయలకు ప్యారా చూట్ నేతలకు టికెట్లు అమ్ముకున్నాడంటూ ధ్వజమెత్తారు. రేవంత్ ఫ్లెక్సీలు చించేయడంతో పాటు పార్టీ జెండాలను తగులబెట్టి రణరంగం సృష్టించారు. పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయగా.. మరికొందరు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు. జూబ్లీహిల్స్ నుంచి పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి తాను ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీలో ఉంటానని తేల్చి చెప్పగా.. కూకట్‌పల్లిలో టికెట్ ఆశించిన గొట్టిముక్కల వెంగళరావు కన్నీరు మున్నీరవుతూ పార్టీకి రాజీనామా చేశారు. మహేశ్వరంలో బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మరో నేత దేప భాస్కర్‌రెడ్డిలకు రేవంత్ రెడ్డి టికెట్ ఆశ చూపి కోట్లు ఖర్చుపెట్టించాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో దండెం రాంరెడ్డి అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, అంబర్‌పేటలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఏది ఏమైనప్పటికీ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన నేతలు పార్టీని వదిలే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా ఎల్బీనగర్‌లో అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌కు నియోజకవర్గం నేతలు జలక్ ఇచ్చారు. మహేశ్వరం టికెట్ కేఎల్ఆర్‌కు ఇవ్వగా.. ఇక్కడ కూడా ఆయనకు సహాయ నిరాకరణ మొదలైంది.

**- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)**



గాంధీభవన్ ఎదుట ధర్నా చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి వర్గీయులు

# గులాబీ జైత్రయాత్ర

## ఎన్నికల మ్యానిఫెస్టో ప్రచార అస్త్రంగా ప్రజల్లోకి..

సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ ) : గుర్తుల గుర్తుంచుకో.. కారును గుర్తుంచుకో.. అంటూ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థుల జైత్రయాత్ర జోరుగా సాగుతున్నది. నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఇంటింటి ప్రచారం.. పాదయాత్రలు చేపడుతూనే.., మరోవైపు ఆత్మీయ సమావేశాలతో అన్ని వర్గాల మద్దతును కూడగడుతున్నారు. కలిసివచ్చే నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తూ.. అన్ని వర్గాలను ఒక్క తాటిపైకి చేరుస్తూ.. క్యాడర్‌లో నూతనోత్తేజాన్ని నింపుతున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టో ప్రచార అస్త్రంగా గులాబీ సైనికులు ప్రతి ఓటరును కలుస్తూ.. అభ్యర్థుల గెలుపునకు బాటలు సుగమం చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల డిపాజిట్లను గల్లంతు చేయడమే లక్ష్యంగా తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. దాదాపు రెండు నెలల గులాబీ శ్రేణుల ప్రచార శైలితో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.




# సర్కారు వైద్యం.. కొండంత ధైర్యం

## వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు

సమైక్య పాలనలో దుర్భరంగా ప్రభుత్వ దవాఖానలు

స్వరాష్ట్రంలో సరికొత్త రూపు.. అత్యాధునిక వైద్యసేవలు

**సమైక్య రాష్ట్రంలో** ప్రజారోగ్యం అంటే గాలిలో దీపంలా ఉండేది. కానీ స్వరాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగం కొత్త రూపం దాల్చింది.. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే దశాబ్దాల దుస్థితి నుంచి.. పోదాం పద.. సర్కారు దవాఖానకు అనే భరోసా వచ్చింది. నాడు ప్రభుత్వ ఆస్పత్రి అంటే.. దైన్యం.. నేడు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే ఒక ధైర్యం. ఇలా ఆరోగ్య తెలంగాణ సాధన దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వైద్యరంగంలో విప్లవం సృష్టిస్తున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా నగరంలోని ప్రభుత్వ వైద్యశాలలను తీర్చిదిద్దడంతో పేదలకు మెరుగైన వైద్యం అందుతున్నది. వైద్యారోగ్య రంగంలో హైదరాబాద్ ప్రస్థానం.. దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయనంగా నిలుస్తున్నది. **- సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)**





నిమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన '2-డి సీ ఆర్మ్' యంత్రాన్ని పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, వైద్యులు (ఫైల్)